క్లుప్తంగా

పోచమ్మకు బోనాలు



కొత్తగూడ: మండలంలోని ఎంచగూడెం గ్రామంలో గ్రామ దేవత పోచమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. మహిళలు బోనం ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో, శివసత్తుల పూన కాలతో తరలి అమ్మవారికి మొక్కులు చెల్లించు కున్నారు.

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామంలోని హరిజన కాలనీకి చెందిన ప్రజలు బోనాల వేడుకలను బుధవారం కనులపండు వగా నిర్వహించారు.

విద్యార్థినులతో జీసీడీఓ భోజనం



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బుధవారం రాత్రి జిల్లా జీసీడీఓ విజయకుమారి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందిం చాలని వంట మనుషులకు సూచించారు.

గొర్రెను గాయపర్చాడని పోలీస్‌స్టేషన్‌కు..

బయ్యారం: రోడ్డు ప్రమాదంలో గొర్రెను గాయపర్చిన వారి నుంచి న్యాయం చేయాలని కోరుతూ యజమాని గొర్రెను పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకొచ్చిన ఘటన బుధవారం బయ్యారంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని జగ్నాతండాకు చెందిన గుగులోత్ బిక్కుకు చెందిన గొర్రెల మంద మేత కోసం వెళ్తున్న సమయంలో ఇర్సులాపురం వైపు నుంచి బయ్యారం వస్తున్న అటవీశాఖకు చెందిన జీపు గొర్రెను ఢీకొంది. దీంతో గొర్రెల యజమాని గాయపడిన గొర్రెను తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్ ఆవరణం బయట కట్టేసి గొర్రెలు మేపేందుకు వెళ్లాడు. ఈవిషయంపై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా బాధితుడు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు.

అప్రమత్తంగా ఉన్నాం..

డోర్నకల్: భారీ వర్షాలతో ఎలాంటి సమస్యలు తలెత్తినా పరిష్కరించేందుకు అప్రమత్తంగా ఉన్నామని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. భారీ వర్షాలతో బుధవారం పలుప్రాంతాల్లో డ్రెయినేజీలు మూసుకుపోయి వరదనీరు రోడ్లపైకి ప్రవహిస్తుండడంతో మున్సిపల్ సిబ్బంది చెత్తను తొలగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణవేణి, సీఐ బి.ఉపేందర్‌రావు, మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు

తొర్రూరు రూరల్: గ్రామాలు, గిరిజన తండాలు, హరిజన కాలనీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీఓ పూర్ణచందర్ అన్నారు. బుధవారం ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెలికట్ట గ్రామాన్ని సందర్శించారు.

చెట్టు తొలగింపు

మహబూబాబాద్ రూరల్: భారీ వర్షం కారణంగా జిల్లా కేంద్రంలోని ఇల్లెందు రోడ్డు ఆర్టి గార్డెన్ సమీపంలో చెట్టు విరిగి రోడ్డుపై పడిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, సిబ్బందితో కలిసి బుధవారం జేసీబీ ద్వారా రోడ్డుపై పడిన చెట్టును తొలగించి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

'పేరు ప్రఖ్యాతలు పొందాలి'

తొర్రూరు రూరల్: విధుల్లో మంచి పేరు ప్రఖ్యాతలు పొందుతేనే సంతృప్తి కలుగుతుందని డీఈఓ పి.రామారావు అన్నారు. బుధవారం మండలంలోని చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో 24 ఏళ్లుగా అటెండర్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఎస్.సరళను డీఈఓ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం బుచ్చయ్య, ఏసీజీ శ్రీరాములు, డీఎస్ఓ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వాన.. చెరువుల మత్తడి

కురవి: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సీరోలు మండలం చింతపల్లి గ్రామంలోని పెద్ద చెరువులోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో అలుగుపోస్తోంది. బుధవారం అలుగు వద్ద మత్స్యకారులు వలను ఏర్పాటు చేసుకున్నారు. సీరోలు మండలం రేకుల తండా జీపీ పరిధిలోని జగ్యాతండా సమీపంలో చింతపల్లి-సీరోలు మార్గమధ్యలో ఉన్న కల్వర్టును, వాగును మరిపెడ సీఐ హతిరాం, సీరోలు ఎస్సై విజయ్‌రాం కుమార్ బుధవారం పరిశీలించారు. రాత్రి సమయంలో వాగు ఉధృతి పెరిగి రోడ్డుపై రాకపోకలకు ఇబ్బంది ఏర్పడకుండా, లోలెవల్ వంతెన వద్ద ప్రమాద సూచికలు పెట్టేందుకు పరిశీలించినట్లు సీఐ తెలిపారు.

మరిపెడ రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండు కుండను తలపిస్తున్నాయి. మండలంలోని ఎల్లంపేట పెద్దచెరువు నిండుకుంది.

బయ్యారం: మండలంలోని పలు గ్రామాల పరిధిలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బయ్యారం పెద్దచెరువులోకి పందిపంపుల, మసివాగు, రాళ్ల వాగు నుంచి వరద నీటి ప్రవాహం భారీగా వస్తుండటంతో అలుగుల నుంచి భారీస్థాయిలో వరదనీరు బయటకు వెళ్తోంది.

రోడ్డుపైకి చేరిన వరదనీరు

నెల్లికుదురు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వావిలాల గ్రామ పరిధిలోని నెల్లికుదురు నుంచి మహబూబాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపైకి బుధవారం వరద నీరు చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నీట మునిగిన పెసర పంట

మరిపెడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పెసర, పత్తి పంటలు నీట మునిగాయి. చేతికందిన



కురవి: మత్తడి పోస్తున్న చింతపల్లి చెరువు



నెల్లికుదురు: వావిలాల గ్రామ పరిధిలో రోడ్డుపై నుంచి వెళ్తున్న వరదనీరు



బయ్యారం: కట్టుగూడెం సమీపంలో నీట మునిగిన పంటపొలాలు



చిన్నగూడూరు: చిన్నగూడూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగు



మరిపెడ రూరల్: ఎల్లంపేటలో నిండుకున్న పెద్దచెరువు



మరిపెడ శివారులో నీట మునిగిన పెసర పంట



కురవి: నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

పెసర పంట నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండలాల్లో చెరువులు, కుంటలు మత్తడి పోస్తున్నాయి. గ్రామస్తులు వలలతో మత్తళ్ల వద్ద పోటీపడుతూ చేపలు పడుతుండటంతో సందడి చోటుచేసుకుంది. కాగా మంగళవారం 53.6 మిల్లీమీటర్లు, బుధవారం 8.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసినట్లు అధికారులు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగు..

చిన్నగూడూరు: భారీ వర్షాలకు ఆకేరు వాగులో వరదనీరు చేరి పొంగి ప్రవహిస్తోంది. గుండంరాజుపల్లి, పగిడిపల్లి నుంచి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో జిన్నెల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాహనదారులు, ప్రజలు వాగు దాటకుండా మండల ప్రత్యేక అధికారి వరలక్ష్మి, ఎంపీడీఓ రామారావు, సీఐ హతీరాం, ఎస్సై ఝాన్సీ పర్యవేక్షణ చేపట్టారు.

నర్సింహులపేట: మండలంలోని కొమ్ములవంచ గ్రామంలోని కొత్తచెరువు బుధవారం కురిసిన వర్షానికి మత్తడి పోయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ నాగరాజు రోడ్డుపై నీరు ప్రవహించడంతో సిబ్బందితో రాకపోకలను బంద్ చేయించారు.

ప్రమాణస్వీకారం

తొర్రూరు: లయన్స్‌క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని క్లబ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. క్లబ్ ఆఫ్ సేవా తరుణి నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించారు. నూతన అధ్యక్షురాలు మాదవపెద్ది వాణి, ప్రధాన కార్యదర్శి ఆమంచి రాధిక, కోశాధికారి గాదె మణిలతో క్లబ్ జిల్లా ఉపగవర్నర్ చంద్రశేఖర్ ఆర్య ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఉపగవర్నర్ సుధాకర్‌రెడ్డి, మాజీ గవర్నర్లు రాజేందర్‌రెడ్డి, తమ్మెర లక్ష్మీనరసింహరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

కురవి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీడీ శాంతకుమారి అన్నారు. బుధవారం సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ యాకాంబ్రం, టీఏ రవి, ఎఫ్ఏ ఎల్లయ్య, కార్యదర్శి శ్రావణి, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వర్‌రావు సూచించారు. మరిపెడ మండలంలోని బుర్హాన్‌పురం, తానంచర్ల గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి గుగులోతు రవి, సూపర్‌వైజర్ సుదర్శన్, లక్ష్మిఝాన్సీ, ఏఎన్ఎం లలిత, రోజామణి పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు

మరిపెడ రూరల్: ప్రజల ప్రాణాలను హరిస్తున్న గుడుంబా మహమ్మారిని ఉపేక్షించేది లేదని, సారాయి తయారు చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు హెచ్చరించారు. బుధవారం మరిపెడ మండలంలోని సోమ్లాతండా, బాల్యతండా, దుబ్బతండాల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 62 లీటర్ల గుడుంబా, 140 కిలోల నల్లబెల్లం, 20లీటర్ల పటికను స్వాధీనం చేసుకుని, 1100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 10 మందిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. అదే విధంగా ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట కమిషనర్ మాట్లాడుతూ.. మానుకోట జిల్లాను గుడుంబా రహిత జిల్లాగా మర్చేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. దాడుల్లో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కిరణ్, అసిస్టెంట్ సూపరిండెంట్ ప్రవీణ్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సైలు నీరజ, నాగయ్య, ఎస్సై గంద్ర సంతోష్, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు

కోర్టు విధుల బహిష్కరణ.. ర్యాలీ



మహార్యాలీ నిర్వహించి, ఆర్టీసీ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

జనగామ: ఓ కేసు విషయమై మాట్లాడేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులు అమృతరావు, కవితలపై పోలీసులు దాడి చేశారని నిరసిస్తూ జనగామ కోర్టులో రెండోరోజు బుధవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రరుషి ఆధ్వర్యాన అడ్వొకేట్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా వరంగల్, భూపాలపల్లి, పరకాల, సిద్దిపేట, రంగారెడ్డి, సూర్యాపేట, హైదరాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం జిల్లాలకు చెందిన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వచ్చారు. ప్రముఖులు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో ఉదయం, మధ్యాహ్నం చర్చలు జరిపారు. సీఐతోపాటు దాడిలో పాల్గొన్న ఎస్సై, పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. చర్చలు విఫలం కావడంతో కోర్టు ఆవరణ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించగా.. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

న్యాయవాదుల ఫిర్యాదుపై కేసు నమోదు

పోలీసులు, న్యాయవాదుల మధ్య జరిగిన వివాదంలో న్యాయవాదులు ఇచ్చిన ఫిర్యాదుపై జనగామ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులపై కేసు నమోదు చేయడంతోపాటు శాఖాపరమైన విచారణ ప్రారంభించారు. ఈ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మను విచారణ అధికారిగా నియమించినట్లు వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు.

నిర్లక్ష్యంతో పనిచేస్తే చర్యలు తప్పవు

● ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: గ్రామ, మండలస్థాయిలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ముందుగా ఆయన మొక్కలు నాటారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశానికి హాజరుకాని, ఆలస్యంగా విచ్చేసిన అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏదో సమావేశం అంటే వచ్చామా.. టీ, బిస్కెట్లు తిన్నామా.. వెళ్లామా అని కాదు.. ప్రభుత్వ ఉద్యోగిగా కనీస ధర్మాన్ని పాటించాలని, తీసుకునే జీతానికి న్యాయం చేయాలన్నారు. గ్రామాల్లో కరెంటు పోతే హెల్పర్, లైన్‌మెన్, ఏఈ స్పందించకపోవడంతో తన వరకు ఫోన్‌లు వస్తున్నాయన్నారు. ఏ శాఖ అధికారి అయినా, సిబ్బందైనా విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నర్సంపేట ఎన్‌హెచ్ పై భూపతిపేట వద్ద గతంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ షెడ్ కనిపించకుండా పోయిందని, నెలరోజుల్లో అక్కడ బస్టాండ్ ప్రాంగణం ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యే డీఎం ప్రసూనలక్ష్మికి సూచించారు. అనంతరం తహసీల్దార్ శ్వేత ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరస్వామి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.



గూడూరు: ఆర్టీసీ బస్టాండ్‌లో మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

లంబాడ గిరిజనులు సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ సెంటర్‌లో సేవాలాల్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తీజ్ ఉత్సవ ముగింపు వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు.

'పొలంబాట' ప్రారంభం

గూడూరు శివారు వడ్డెరగూడెంలో బుధవారం ప్రభుత్వం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన రైతు పొలంబాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ విజయ్, అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ కవిత, మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న పాల్గొన్నారు.



గూడూరు: తీజ్ బుట్టతో ఎమ్మెల్యే మురళీనాయక్

ఆశ్రమ పాఠశాలల సమస్యలు పరిష్కరిస్తా..

మహబూబాబాద్ అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల డైనింగ్ హాల్‌ను ఎమ్మెల్యే, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన శాఖ అధికారి సైదమాలోత్, హెచ్ఎం పొడుగు నర్సయ్య, హెచ్‌డబ్ల్యూఓ అనిత, మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్లు వెంకన్న, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో పంచాయతీల ఏర్పాటు

పెద్దవంగర: పాలకుర్తి ఎమ్మెల్యే కృషితో నూతన పంచాయతీల ఏర్పాటు సాధ్యమైందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పూర్ణచందర్, మురళిగౌడ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పెద్దవంగర: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దయన్న కృషితోనే..

తొర్రూరు: నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుకు దయన్న కృషి చేశారని మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో మాజీ మంత్రి దయాకర్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్‌రెడ్డి, ప్రమోద్, కాలునాయక్, యాకన్న, శ్రీనివాస్, వెంకటేష్, సోమన్న పాల్గొన్నారు.

కేసీఆర్‌దే ఘనత..

మరిపెడ రూరల్: తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని మాజీ ఎంపీపీ గుగులోతు అరుణ బుధవారం తెలిపారు.

జాతీయ చేనేత దినోత్సవం

పెద్దవంగర: చేనేత వస్త్రాలను ఆదరించాలని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఏదునూరి రేణుక, సిరి శ్రీనివాస్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని చిట్యాలలో చేనేత కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు లక్ష్మీనారాయణ, అనపురం రవి, ఎర్ర వెంకన్న, కోట శంకర్, రాపోలు శంకర్, శ్రీనివాస్, యాదగిరి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: చేనేత దినోత్సవం సందర్భంగా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సంఘం భవన్‌లో బుధవారం కొండాలక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నారాయణ శ్రీనివాసు, కృష్ణమూర్తి, సాగర్ పాల్గొన్నారు.



పెద్దవంగర: చేనేత కార్మికులను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

హెచ్ఎంకు సన్మానం

గంగారం: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలకు నూతనంగా బదిలీపై వచ్చిన పీజీహెచ్ఎం కల్తి కాంతారావును ఆదివాసీ ఉద్యోగుల సంఘం, గంగారం మండల ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ముడిగ రాంచందర్, మండల అధ్యక్షుడు మొల్కం లక్ష్మీనర్సు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

టీకాల పంపిణీ పూర్తి చేయాలి

నెహ్రూసెంటర్: టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ సభ్యుడు, ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఇందిరానగర్ కాలనీ సబ్ సెంటర్ యూపీహెచ్‌సీ మహబూబాబాద్‌లో నిర్వహించిన జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.

గూడూరు ఎస్సైగా గిరిధర్‌రెడ్డి



గూడూరు/మహబూబాబాద్ రూరల్: గూడూరు ఎస్సైగా బి.గిరిధర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్సై సీహెచ్.నగేష్ ఇటీవల మహబూబాబాద్ రూరల్ పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఎస్సై గిరిధర్‌రెడ్డి ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. అదేవిధంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి.భాస్కర్ ఏఆర్ ఎస్సైగా పదోన్నతి పొంది ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు

బయ్యారం: బయ్యారంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమవుతున్నట్లు ఓపెన్ స్కూల్ అడిషనల్ కోఆర్డినేటర్ పి.దేవేంద్రాచారి తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

నెల్లికుదురు: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై చిర్ర రమేష్ బాబు అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

బయ్యారం: రోజురోజుకు పెరుగుతున్న సైబర్‌నేరాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని గార్ల-బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి అన్నారు. జగ్గుతండాలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం విద్యార్థినులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు.

కొత్తగూడ: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కవద్దని ఎస్సై కుశకుమార్ విద్యార్థులకు సూచించారు. బుదవారం మండలకేంద్రంలోని ఎస్ఎంహెచ్ విద్యార్థులతో ఆయన మాట్లాడారు.

'పొలంబాట'

తొర్రూరు రూరల్: వ్యవసాయ బావులు, బోర్లకు వినియోగిస్తున్న మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ డీఈ మధుసూదన్ కోరారు. బుధవారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో విద్యుత్‌శాఖ వారి ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నెల్లికుదురు: మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి, మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పరిశుభ్రత, మధ్యాహ్న భోజనంపై బుధవారం మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మరిపెడ రూరల్: పచ్చదనంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం పరిశుభ్రత పనులు చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, ఎంపీఓ సోంలాల్, ఏపీఓ మంగమ్మ, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

డోర్నకల్: ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఏఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో బుధవారం రైలు ప్రయాణికులు, ఆటోడ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

జయప్రదం చేయండి

గార్ల: ఈనెల 9న అంతర్జాతీయ ఆదివాసీ పోరాట దినోత్సవంను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం (ఏఐటీఎఫ్) రాష్ట్ర నాయకుడు జి.సెక్రు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం మండలంలోని చిన్నకిష్టాపురం గ్రామంలో ఆదివాసీలతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు.

సంగ్యాతండాలో కూలిన ఇల్లు

బయ్యారం: మండలంలోని సంగ్యాతండాలో భారీ వర్షాలకు ఇల్లు కూలింది. తండాకు చెందిన అజ్మీరబాలు ఇల్లు పంటకాల్వ పక్కన ఉంది. వర్షాలకు కాల్వలో నిండుగా నీరు ప్రవహించి ఇంటి ఆవరణంలోకి వచ్చాయి. దీంతో ఇల్లు కూలిపోయింది.

ఎల్ఓసీ అందజేత

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన నిరుపేద కొనతం రామనర్సమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈమేరకు స్పందించిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షల ఎల్ఓసీని బుధవారం రామనర్సమ్మ కుమారుడు వెంకటేశ్వర్లుకు అందించారు.

విద్యార్థుల అభ్యున్నతికి సహకరించాలి

తొర్రూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల అభ్యున్నతికి అందరూ కృషి చేయాలని వందేమాతరం ఫౌండేషన్ డైరెక్టర్ తక్కెళ్లపల్లి రవీంద్ర అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దాత ప్రతాపని వెంకటేశ్వర్లు సహకారంతో పట్టణంలోని వందేమాతరం ఫౌండేషన్‌కు ఎల్ఈడీ లైట్లు, పదో తరగతి విద్యార్థుల స్టడీ మెటీరియల్‌ను బుధవారం డివిజన్ కేంద్రంలోని నితిన్ భవన్‌లో ఫౌండేషన్ డైరెక్టర్ రవీంద్రకు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చిదురాల నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తమ్మి రమేష్, కోశాధికారి భోనగిరి శంకర్‌లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

గడ్డిమందు తాగి ఆత్మహత్య

బయ్యారం: ఆర్థిక ఇబ్బందులతో భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకోగా మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలోని బోటితండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన వాంకుడోత్ నంద (45) ఆర్థిక ఇబ్బందులపై భార్య మాల్కుతో మంగళవారం గొడవపడ్డాడు. దీంతో నంద మనస్తాపంతో గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు నగేష్ ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

డోర్నకల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై సంతోష్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. జోగ్యాతండాకు చెందిన చాందావత్ రాంబాబు(29) మంగళవారం ఖమ్మం నుంచి జోగ్యతండాకు వస్తుండగా ముల్కలపల్లి సమీపంలో మరో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న బలపాలకు చెందిన దంపతులు బత్తుల వెంకటేశ్వర్లు, స్వరూపకు కూడా గాయాలయ్యాయి. రాంబాబును ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి..

డోర్నకల్: మహబూబాబాద్ తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. డోర్నకల్ జీఆర్‌పీ ఎస్సై జె.సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో కిలోమీటర్ నంబర్ 432/1-3 వద్ద సుమారు 30నుంచి 35సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైలు నుం,చి జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు గోధుమ రంగు షర్టు, బ్లాక్ కలర్ పాయింట్ ధరించాడని, మహబూబాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అన్నం ఫౌండేషన్ అధ్యక్షులు అన్నం శ్రీనివాస్ సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 58600, 94947 90619 నంబర్లకు సంప్రదించాలని ఎస్సై సురేష్ కోరారు.